సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 14 । మే । 2023

## హెచ్ఐసీసీలో 'సూత్ర' ఎగ్జిబిషన్

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 'సూత్ర' వస్త్ర ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనను పలువురు మోడల్స్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'సూత్ర' వస్త్ర ప్రదర్శన నిర్వాహకులు ఉమేష్‌మద్యన్ మాట్లాడుతూ.. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లతో కూడిన వస్త్రాలు, చీరలు, లెహంగాలు, నగలు, మాలు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



షాబాద్: బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

## న్యూస్‌రీల్

### గురునానాక్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శాంతికుమార్

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న గురునానక్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పుప్పల శాంతికుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీ అనుమతులు రాకున్నా విద్యార్థులను చేర్చుకుని లక్షలాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. విద్యార్థులు, పిల్లల జీవితాలపై ఆందోళన చెందుతున్న తల్లిదండ్రుల తరఫున న్యాయబద్ధంగా ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు.యూనివర్సిటీ పేరుతో అక్రమ దందా,ప్రత్యేక తరగతుల పేరుతో అధికఫీజులు వసూలు చేస్తున్న గురునానక్ కళాశాలను సీజ్ చేయాలని.. యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్నం మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నదాతలకు అండగా ప్రభుత్వం



ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ లక్ష్మారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ వంగేటి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పోల్కంపల్లిలో శనివారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇస్తోందని, సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు అందజేస్తోందన్నారు. రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు తెరిచినట్టు చెప్పారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రవేశపెట్టి కేసీఆర్ రైతు బాంధవుడయ్యాడని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ అంజిరెడ్డి, సర్పంచ్ అండాలు,ఎంపీటీసీ చెరుకూరి మంగ, పీఏసీఎస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలయ్య, పీఏసీఎస్ సీఈఓ లక్ష్మణ్ పాల్గొన్నారు.

### సహజ సంపదను పరిరక్షించుకుందాం

సాక్షి, సిటీబ్యూరో: కుతుబ్ షాహీ టూంబ్స్‌తో పాటు దక్కన్ పార్క్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక, క్రీడా, సాంస్కృతిక, పురావస్తు శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. శనివారం ఆగాఖాన్ ట్రస్ట్ సాంస్కృతిక విభాగం ప్రతినిధులతో కలిసి కుతుబ్ షాహీ టూంబ్స్, డెక్కన్ పార్క్ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహజ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా యునెస్కో అవార్డు ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆ మెట్ల బావి పనులను తనిఖీ చేశారు.

# వీకెండ్ హోం.. సరదాగా గడిపేస్తాం

**సండే స్పెషల్**

**వీకెండ్ హోమ్స్‌పై పెరుగుతున్న ఆసక్తి**

- పల్లెల్లో వ్యవసాయ క్షేత్రాల కొనుగోలు
- ఖర్చుకు వెనుకాడకుండా నిర్మాణాలు
- అభిరుచులకు తగ్గట్టు ప్రత్యేక సెట్టింగ్‌లు
- వారంలో ఒకటిరెండు రోజులు కుటుంబసమేతంగా ఎంజాయ్
- స్థానికులకు పెరుగుతున్న ఉపాధి అవకాశాలు



యాచారం-చౌదర్‌పల్లి మధ్యన ఓ వ్యాపారి నిర్మించుకున్న వ్యక్తిగత గృహం

యాచారం: ఉరుకులు పరుగుల జీవనం.. ఒత్తిడితో కూడిన విధులు నిర్వర్తిస్తున్న నగరవాసులు వీకెండ్‌లో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపేందుకు మొగ్గు చూపుతున్నారు. రణగొణధ్వనులకు దూరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా నగరానికి కాస్త దూరంగా వీకెండ్ హోమ్స్, వ్యక్తిగత గృహాలను నిర్మించుకుంటున్నారు. రోడ్డు మార్గం, రావాణా సౌకర్యం ఉన్న పల్లె ప్రాంతాల్లో ఎకరా వ్యవసాయ భూమిని రూ.30లక్షల నుంచి రూ.50 లక్షలకు పైగా కొనుగోలు చేస్తున్నారు. సకల సౌకర్యాలతో నిర్మాణాలను చేపడుతున్నారు. నిత్యం బిజీగా ఉండేవారు వీకెండ్‌లో తమ వ్యవసాయ పొలాల్లో నిర్మించిన వ్యక్తిగత గృహాల్లో కుటుంబ సమేతంగా సరదాగా గడుపుతున్నారు. యాచారం, మంచాల, మాడ్గుల మండలాల్లోని పలు గ్రామాల్లో వందలాదిగా వీకెండ్ హోమ్స్, వ్యక్తిగత గృహాలు ఊపందుకున్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటికి పైనే ఖర్చు చేస్తుండడం విశేషం.

**స్థానికులకు జీవనోపాధి**

బడానేతలు, వ్యాపారవేత్తలు, ఉన్నతాధికారులు గ్రామాల్లో నిర్మించే వీకెండ్ హోమ్స్, వ్యక్తిగత గృహాలతో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. వ్యక్తిగత గృహాలు, వీకెండ్ హోమ్స్‌కు యజమానులు వారానికో, పదిహేను రోజులకో వచ్చి వెళ్తున్నారు. యజమానులు ఉంటే పని.. లేదంటే ఆ ఇళ్లకు రక్షణగా ఉంటూ పలువురు స్థానికులు మంచి వేతనం పొందుతున్నారు. ఒక్కొక్కరు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు జీతాలు తీసుకుంటున్నారు. మరోవైపు నిర్మాణ పనుల్లోనూ స్థానికులకు పని దొరుకుతోంది.

### ఆకట్టుకుంటున్న వ్యక్తిగత గృహాలు

పల్లెల్లో నిర్మిస్తున్న వ్యక్తిగత గృహాలు, వీకెండ్ హోమ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పండ్ల తోటల మధ్యన కనువిందు చేసే విధంగా కర్రలు, పక్షుల బొమ్మలు, జంతువుల చిత్రాలతో ఆకట్టుకుంటున్నాయి. యాచారం మండలం గడ్డమల్లయ్యగూడలోని గునుగల్-లోయపల్లి రోడ్డులో ఓ వ్యాపారవేత్త తన వ్యవసాయ క్షేత్రంలో రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేసి నిర్మించుకున్న వ్యక్తిగత గృహం ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులను ఆకర్షిస్తోంది. యాచారం-చౌదర్‌పల్లి గ్రామాల మధ్యన సాయిబాబా ఆలయం సమీపంలో నగరానికి చెందిన ఓ వ్యాపారవేత్త రూ.50 లక్షలతో ఇటీవల పూర్తి చేసుకున్న ఇంటి నిర్మాణం కనువిందుగా ఉంది. మొండిగౌరెల్లిలో రూ.కోటికి పైగా నిధులతో నాలుగు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆధునిక పద్ధతిలో వీకెండ్ హోమ్ నిర్మాణం సాగుతోంది. ఇంకా చాలా మంది ఆయా గ్రామాల్లో ఎకరా, రెండు ఎకరాల వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేసి వ్యక్తిగత గృహాల నిర్మాణాలకు సిద్ధమవుతున్నారు. నందివనపర్తి, యాచారం, మాల్, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, గునుగల్, గడ్డమల్లయ్యగూడ తదితర గ్రామాల్లో వీకెండ్ హోమ్స్ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.



గడ్డమల్లయ్యగూడలో ఆకట్టుకునేలా ఇలా..

**ఉత్సాహంగా గడుపుతాం..**



గడ్డమల్లయ్యగూడలోని వ్యవసాయ క్షేత్రంలో ఆసక్తితో వ్యక్తిగత గృహాన్ని నిర్మించుకున్నాం. వ్యాపార రీత్యా ఎంత బిజీగా ఉన్నా.. ఎన్ని ఒత్తిడులున్నా వారానికి రెండు, మూడు రోజులు ఇక్కడికి వచ్చి సేదతీరుతాను. కొన్నిసార్లు స్నేహితులు, కుటుంబ సభ్యులతో వచ్చి సంతోషంగా గడిపి వెళ్తాం.

– గుండ్లపల్లి ప్రవీణ్ రెడ్డి, హైదరాబాద్

# కాంగ్రెస్‌లో కర్ణాటక జోష్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కర్ణాటక ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌లో జోష్‌ని నింపాయి. వరుస ఓటములతో తీవ్రమైన నిరాశలో ఉన్న పార్టీ శ్రేణుల్లో కర్ణాటక ఎన్నికల్లో వరించిన అఖండ విజయం నూతనోత్తేజాన్ని నింపింది. షాద్‌నగర్ రేగడి చిలకమర్రిలో సీఎల్పీనేత భట్టి విక్రమార్క సహా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి కేక్ కట్ చేసి, విజయోత్సవాలు జరుపుకొన్నారు.పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా ఇదే తరహా ఫలితాలు రావడం ఖాయమని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఒకవైపు కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవంలో మునిగి తేలితే.. మరోవైపు బీజేపీ శ్రేణులు నైరాశ్యంలో మునిగిపోయాయి.

**దేశంలో బీజేపీ పతనం ప్రారంభమైంది**

షాబాద్: దేశంలో బీజేపీ పతనం ప్రారంభమైందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయంపై బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక ఫలితాలు తెలంగాణలో రిపీట్ అవుతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా బీజేపీకి ఎదురుగాలి వీస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్, పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు షాబాద్ దర్శన్, సున్నపు వసంతం, జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, దేశమల్ల ఆంజనేయులు, చేవెళ్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

- మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడంతోనే అభివృద్ధి సాధ్యమవుతోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్ రైతుబజార్ వద్ద రూ.30 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన మహిళా మండలి షాపింగ్ కాంప్లెక్స్, మంత్రాల చెరువు వద్ద రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల ఆట పరికరాలను శనివారం సాయంత్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంత్రాల చెరువు సుందరీకరణలో భాగంగా పెద్దలు, చిన్నారులకు ఉపయోగపడేలా ఓపెన్‌జిమ్,ఆట పరికరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ముంపు ప్రాంతం ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందిందని, అభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులు,అధికారులు, స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి,డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రాల చెరువు వద్ద ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట పరికరాల ప్రారంభం సందర్భంగా చిన్నారులు, స్థానికులతో మంత్రి సబితారెడ్డి

# చకచకా ఫాక్స్‌కాన్ పనులు





ఇబ్రహీంపట్నం రూరల్: ఎలక్ట్రానిక్ దిగ్గజం ఫాక్స్‌కాన్ భూమిపూజ పనులు చకచకా సాగుతున్నాయి. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో కలెక్టరేట్ ఎదుట ఫాక్స్‌కాన్ కంపెనీకి 196 ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నెల 15న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా పునాదిరాయి వేయనున్నారు. ఇందుకోసం తైవాన్ కంపెనీ ప్రతినిధులు దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. భూమిపూజ చేసే వేదిక, సభాస్థలి, భోజన శాలలను సిద్ధం చేస్తున్నారు. శనివారం మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పనులను పరిశీలించారు.

# వడివడిగా ఎయిర్‌పోర్టు మెట్రో

- ఈ నెలాఖరు వరకు టెండర్లు
- విధివిధానాలపై నోడల్ ఏజెన్సీకి బాధ్యతలు
- ఇప్పటికే ఢిల్లీ ఎయిర్‌పోర్టు మెట్రోపై అధ్యయనం
- అదే తరహాలో లగేజీ తనిఖీలు, చెక్ ఇన్ సేవలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఎయిర్‌పోర్టు మెట్రో రైలు నిర్మాణ కార్యాచరణ వేగవంతమైంది. ఈ ప్రాజెక్టు కోసం ఈ నెలాఖరు వరకు గ్లోబల్ టెండర్లను ఆహ్వానించేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ కార్యాచరణ చేపట్టింది. బిడ్డింగ్ విధివిధానాలు, నియమనిబంధనల రూపకల్పన బాధ్యతలను ఓ నోడల్ ఏజెన్సీకి అప్పగించినట్లు అధికారులు తెలిపారు. నోడల్ ఏజెన్సీ బిడ్ డాక్యుమెంట్లను రూపొందించి టెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

**రూ.6 వేల కోట్లకు పైగా నిధులతో..**

ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ నిర్మాణం చేపట్టనున్నారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 31 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఎయిర్‌పోర్టు మెట్రో నగరానికి మరో మణిహారం కానుంది. దాదాపు రూ.6 వేల కోట్లకు పైగా అంచనాతో చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో రైలు మార్గం వేగవంతం కావడానికి పనులు చకచకా సాగుతున్నాయి.

**ఐటీ కారిడార్‌కు వెన్నుదన్ను..**

ఎయిర్‌పోర్టు మెట్రో రైలు అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలకు మార్గం సుగమమం చేయడంతో పాటు ఐటీ కారిడార్లలో సేవల విస్తరణకు మరింత దోహదం చేయనుంది. రాయదుర్గం టర్మినల్, మైండ్‌స్పేస్ జంక్షన్, బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్డు, నానక్‌రాంగూడ జంక్షన్ మీదుగా ఔటర్ మార్గంలో ఎయిర్‌పోర్టు వరకు నిర్మించనున్నారు. దీంతో రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులతో పాటు రాయదుర్గం నుంచి నార్సింగి వరకు పెద్ద సంఖ్యలో ఏర్పడిన ఐటీ సంస్థలకు రాకపోకలు సాగించే సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఐటీ ఉద్యోగులకు రవాణా సేవలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు బుద్వేల్ వరకు సాఫ్ట్‌వేర్ బూమ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు మెట్రో..ఐటీ సంస్థల విస్తరణకు సైతం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

**ఆటంకాలను అధిగమించేలా..**

ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్‌లో పలు చోట్ల ఆటంకాలు ఉన్నాయి. చాలా వరకు రోడ్డు మార్గం నుంచే వెళ్తున్నప్పటికీ ఒకటి, రెండు చోట్ల గుట్టలపై నుంచి మెట్రో పరుగులు తీయాల్సివస్తుంది. దీంతో ఆయా చోట్ల అలైన్‌మెంట్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

**ఢిల్లీ తరహాలో సేవలు..**

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి నేతృత్వంలో ఇంజినీరింగ్ నిపుణుల బృందం ఇటీవల ఢిల్లీ ఎయిర్‌పోర్టు మెట్రో స్టేషన్‌ను సందర్శించింది. అక్కడి ప్రయాణికులకు లభిస్తున్న సేవలు, సదుపాయాలు, రైళ్ల రాకపోకలపై అధికారులు అధ్యయనం చేశారు. అదే పద్ధతిలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోరైలు సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**నాలుగు స్టేషన్లలో లగేజీ తనిఖీలు..**

ఢిల్లీలో రెండు సిటీ మెట్రో స్టేషన్లలో చెక్‌ఇన్ పూర్తి చేసుకొనే సదుపాయం ఉండగా హైదరాబాద్‌లో రాయదుర్గంతో పాటు మరిన్ని స్టేషన్లలో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చెక్ ఇన్ స్టేషన్‌ల నుంచి లగేజీ నేరుగా ఎయిర్‌పోర్టుకు చేరుకొనేలా ఏర్పాట్లు ఉంటాయి. ఎయిర్‌పోర్టు మెట్రోస్టేషన్ నుంచి లగేజీ తనిఖీలు పూర్తయిన వెంటనే ఆటోమేటిక్‌గా మెట్రో కోచ్‌లోని లగేజ్ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చి చేరేలా ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌తో కూడిన కంటైనర్లను వినియోగిస్తారు. రాయదుర్గం, నానక్‌రాంగూడ,నార్సింగి, రాజేంద్రనగర్ స్టేషన్లలో ఏదైనా ఒకదానిలో ప్రయాణికులు విమానం బయలుదేరే 2 గంటల ముందు చెక్ ఇన్ చేసుకోవచ్చు. చెక్ ఇన్ చేసిన తర్వాత, ప్రయాణికులు మెట్రో రైలులో ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ సంబంధిత విమానాల్లో ఎక్కడానికి తమను తాము భద్రతా తనిఖీ చేసుకొంటే చాలు.

# దొరల పాలన పోవాలి



రేగడిచిల్కమర్రిలో రైతులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

- ఇందిరమ్మ రాజ్యం రావాలి
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కొందుర్గు: రాష్ట్రంలో దొరల పాలన పోవాలని, ఇందిరమ్మ రాజ్యం రావాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం షాబాద్ మండలం నుంచి కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో పేద ప్రజలకు అనేక పథకాలు అందించినట్టు చెప్పారు. భూమిలేని పేదలకు సీలింగ్, అసైన్డ్ భూములు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. దుర్మార్గపు కేసీఆర్ పేదల భూములను లాక్కొని బహుళ జాతి సంస్థలకు ధారాదత్తం చేస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ ఏర్పడితే నిధులు, నీళ్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయంటే అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. ఇచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పులపాలు చేసిండు తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో బహుళార్థక సాధక ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసింది కాంగ్రెస్ అన్నారు. తెలంగాణ ఏర్పడితే కుర్చీ వేసుకొని కూర్చొని లక్ష్మీదేవిపల్లి వద్ద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తానని నమ్మించాడన్నారు. తొమ్మిదేళ్లలో ప్రాజెక్టు నిర్మించడానికి కుర్చీ దొరకడం లేదా, లేక కుర్చోవడానికి స్థలం దొరకడం లేదా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు ఇవ్వడంతోపాటు ప్రతినెల బియ్యం, 9 రకాల సరుకులు అందిస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇళ్లు లేని కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, రూ.5 లక్షలతో ఇల్లు నిర్మిస్తామని, ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత ఇంగ్లిష్ మీడియం విద్య అందిస్తామన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజు, నాయకులు విజయ్‌కుమార్, పురుషోత్తంరెడ్డి, జితేందర్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, అంజిరెడ్డి, బాబర్‌ఖాన్, రఘు, వజ్రమ్మ, నరేందర్, నాగమణి, రజిత, గోవర్ధన్‌గౌడ్, నర్సింలు, ద్విజేందర్, రవి, రాజు పాల్గొన్నారు.

# ఐదో 'సారీ'

నాలుగేళ్ల తర్వాత ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు చూస్తున్న నగర అభిమానులకు ఆశించిన ఆనందం మాత్రం దక్కలేదు. అప్పుడప్పుడు కొన్ని మెరుపులు తప్ప ఆటగాళ్ల నుంచి అద్భుతమైన ప్రదర్శనలేవీ రాకపోగా.. హైదరాబాద్ టీమ్ కూడా పేలవ ప్రదర్శనతో నిరాశపర్చింది. సొంతగడ్డపై ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఆ జట్టుకిది ఐదో పరాజయం. కోల్‌కతాతో జరిగిన మ్యాచ్ తరహాలోనే శనివారం లక్నోతో జరిగిన పోరు కూడా ఫ్యాన్స్‌లో పెద్దగా ఆసక్తిని రేప లేదు. మైదానంలో దాదాపు 11 వేలకు పైగా సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. ఇక చివరగా ఈ నెల 18న బెంగళూరుతో పోరు మిగిలి ఉంది.







విజయానందంలో లక్నో క్రికెటర్లు నికోలస్ పూరన్, మన్కడ్

## మహిళ ఆత్మహత్య

శంకర్‌పల్లి: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని టంగటూరు గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ ప్రసన్న కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అరుంద(48) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతోంది. ఎక్కడ చూపించినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి పురుగు మందు సేవించింది. రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే నగరంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం


సయ్యద్ రసూల్ (ఫైల్)

పహాడీషరీఫ్: వ్యక్తి అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ జానీ శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట అర్ఫాత్ కాలనీకి చెందిన సయ్యద్ రసూల్ (38) కూలీ పని చేస్తుంటాడు. గత నెల 4న బయటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన రసూల్ ఎంతకి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. భార్య అస్మాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఆచూకి తెలిసిన వారు బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో, లేదా 87126 62388 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

## కానిస్టేబుల్ రాజ్‌కుమార్ అరెస్ట్


నిందితుడు రాజ్‌కుమార్

హస్తినాపురం: వనస్థలిపురంలో కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా గొంతుకోసి హత్య చేసిన కానిస్టేబుల్ రాజ్‌కుమార్‌ను శనివారం వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని సంవత్సరాలుగా భార్యపై అనుమానం పెంచుకున్న రాజ్‌కుమార్ ఆమెను చిత్ర హింసలు పెడుతూ వేధింపులకు గురిచేసేవాడని తెలిపారు. శుక్రవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన రాజ్‌కుమార్ అప్పటికే తన వెంట తెచ్చుకున్న కత్తితో తన బార్య శోభను గొంతుకోసి హత్యచేశాడని సీఐ తెలిపారు. భార్యను హత్యచేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆవడానికి ప్రయత్నించిన అతని పెద్ద కొడుకు సాత్విక్‌ను కూడా చంపబోగా.. అతడు రెండు చేతులు అడ్డం పెట్టుకుని తప్పించుకున్నాడని, సాత్విక్ రెండు చేతులకు రక్తగాయాలు కావడంతో వెంటనే రాజ్‌కుమార్ అక్కడ నుంచి తప్పించుకుని పారిపోయినట్లు సీఐ వెల్లడించారు. సాత్విక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని రాజ్‌కుమార్‌ను శుక్రవారం రాత్రి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అతని నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

## 'నా చావుకు నేనే కారణం..'

### చెల్లికి వాట్సాప్ మెసేజ్ పెట్టి యువకుడి ఆత్మహత్య


శివగణేశ్ (ఫైల్)

జీడిమెట్ల: 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను.. నా చావుకు నేనే కారణం' అంటూ ఓ యువకుడు తన చెల్లికి వాట్సాప్‌లో సందేశం పంపి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ వివరాల ప్రకారం... యాదాద్రి జిల్లా నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన శివ గణేశ్ ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చి చింతల్ చంద్రానగర్‌లో ఉంటూ ఎంటీఆర్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. కొన్ని రోజులు చిన్నాన్న శివ స్వామి ఇంట్లో ఉన్నాడు. అనంతరం ఓ గది అద్దెకు తీసుకుని ఒక్కడే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి 12 గంటలకు తన చెల్లి అంజలికి వాట్సాప్‌లో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మెసేజ్ చేశాడు. ఉదయం మెసేజ్ చూసిన అంజలి చింతల్‌లో ఉండే తన చిన్నాన్న శివ స్వామికి ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేసింది. అతను శివగణేశ్ ఉండే గదికి వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

### పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి


జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువత

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇందుకు కర్నాటక ఎన్నికలు శుభ సూచికమని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సూరారం కాలనీకి చెందిన మండల శివకుమార్ తన మిత్ర బృందంతో కలిసి శనివారం టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సాంటిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జగ్గారెడ్డి, పున్నారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత పార్టీ విధానాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.